1,47,294 మందికి గ్యాస్ రాయితీ లబ్ధి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం ప్రధానమైనది. మహిళలకు రూ.500కే గ్యాస్ అందించేందుకు ప్రభుత్వం గతేడాది డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఇందుకోసం జిల్లాలో సుమారు 2 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకానికి 1,47,294 మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, తెల్లరేషన్ కార్డు కలిగిన పేద మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందనుంది. లబ్ధిదారులు ముందుగా మొత్తం డబ్బు (ప్రస్తుతం జిల్లాలో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర.842) చెల్లించి బుక్ చేసుకోవాలి. తర్వాత వినియోగదారు బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం రూ.342 జమచేస్తుంది. 48 గంటల్లోపే వినియోగదారులకు రాయితీ డబ్బులు అందేలా ఏర్పాట్లు చేసింది.



మండలాల వారీగా లబ్ధిదారుల సంఖ్య


ఆళ్లపల్లి-1,282, అన్నపురెడ్డిపల్లి-3,330, అశ్వాపురం-5,836, అశ్వారావుపేట-7,610, భద్రాచలం-6,276, బూర్గంపాడు-9,905, చంద్రుగొండ-5,013, చర్ల-6,250, చుంచుపల్లి-4,731,దమ్మపేట-7,641, దుమ్ముగూడెం-7,633, గుండాల-2,091, జూలూరుపాడు-5,143, కరకగూడెం-2,351, కొత్తగూడెం-9,349, లక్ష్మీదేవిపల్లి-6,110, మణుగూరు-8,847, ములకలపల్లి 4,457, పాల్వంచ-12,754, పినపాక-5,041, సుజాతనగర్-4,978, టేకులపల్లి-7,145, ఇల్లెందు-13,521.

> లబ్ధిదారులందరికీ గ్యాస్ రాయితీ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల సంస్థ అధికారులు, ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. గ్యాస్ రీఫిల్ చేసిన 48 గంటల్లోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రాయితీ సొమ్ము జమవుతుంది. **- పి.రుక్మిణీదేవి, జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారి**

మంచినీటి ఇక్కట్లు తప్పినట్లే!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. తాగునీటి నాణ్యత పరిశీలనతో పాటు బోర్లు, మోటర్లు పాడైతే అదేరోజు మరమ్మతులు జరిగేలా, పైపులైన్ల లీకేజీలను అరికట్టేలా గ్రామ మంచినీటి సహాయకులను నియమించింది. ఇందులో భాగంగా ప్రతి గ్రామానికి ఒకరు(మేజర్ పంచాయతీలకు ఒకరి కంటే ఎక్కువ) బహుళ నైపుణ్యం కలిగిన కార్మికుల(మల్టీ స్కిల్డ్ వర్కర్స్)ను ఎంపిక చేసి శిక్షణ ఇస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'నల్ జల్ మిత్ర' పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తోంది.



సత్వర పరిష్కారంతో స్వయం ఉపాధి

మంచినీటి సహాయకుల ద్వారా ప్రతి గ్రామంలో ఒకరికి స్వయం ఉపాధి లభించనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుమారు 1,100 మందికి ఉపాధి దొరకనుంది. స్థానికంగా ఉంటూ, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై, వయస్సు 45ఏళ్లకు మించనివారు గ్రామ మంచినీటి సహాయకులుగా ఎంపికయ్యారు. వీరికి ప్రభుత్వం తరపున ఎలాంటి జీతభత్యాలు ఉండవు. ఆయా గ్రామాల్లో చేతిపంపులు, మోటర్ల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలను అరికట్టడం, మంచినీటి నాణ్యత పరిశీలన, ట్యాంకులను శుభ్రపరచటం వంటి పనులు చేస్తూ అందుకయ్యే ఖర్చులను పంచాయతీ నిధుల నుంచి పొందాల్సి ఉంటుంది. ఈపథకం వల్ల కొందరికి స్వయం ఉపాధి లభించటంతో పాటు తాగునీటి సరఫరాకు ఆటంకాలు ఎదురుకాబోవని అధికారులు భావిస్తున్నారు.

ఒక్కో అంశానికి ఒక్కో మాస్టర్ ట్రైనీ

గ్రామ మంచినీటి సహాయకులకు చేతిపంపుల మరమ్మతులు, పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టడం, విద్యుత్తు మోటర్ల మరమ్మతులు, నీటి నాణ్యత పరిశీలన అంశాలపై శిక్షణనిస్తారు. ఒక్కో అంశానికి ఒకరు చొప్పున ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి ఎనిమిది మందిని మాస్టర్ ట్రైనీలుగా గుర్తించి ఈనెల 13న హైదరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అవగాహన కల్పించారు. అనంతరం మాస్టర్ ట్రైనీలు ఆయా జిల్లాలోని మండల స్థాయిలో సంబంధిత ఏఈలకు తర్ఫీదు ఇచ్చారు.




చేతిపంపు మరమ్మతులపై సుజాతనగర్‌లోని రైతు వేదికలో కొనసాగుతున్న శిక్షణ

నాలుగు రోజుల పాటు శిక్షణ

ఎంపిక చేసిన గ్రామ మంచినీటి సహాయకులకు ఒక్కోరోజు ఒక్కో అంశంపై శిక్షణ అందుతోంది. భద్రాద్రి జిల్లాలో మొదటగా కొత్తగూడెం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తర్ఫీదు ఇస్తుండగా.. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, వైరా, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో ఒక్కోచోట శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతి గది పాఠాలతో పాటు క్షేత్రస్థాయిలో ఎలా పని చేయాలనేది నేర్పిస్తున్నారు. అనంతరం అదేరోజు పరీక్ష నిర్వహించి ఏమేరకు అవగాహన పెంచుకున్నారనేది పరిశీలిస్తున్నారు. అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలు అందించనున్నారు.

> గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ తరగతులు అక్టోబర్ 22 వరకు కొనసాగనున్నాయి. ఈకార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలకు సత్వర పరిష్కారం దొరకనుంది. జిల్లాలో 497 మందికి స్వయం ఉపాధి లభించనుంది. **- తిరుమలేష్, మిషన్ భగీరథ ఈఈ**

అన్నదాతలకు ఆదాయం అదనం



సన్నరకాలు సాగుచేస్తున్న అన్నదాతలకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే మార్కెట్‌కు తీసుకొచ్చే సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటించింది. తద్వారా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుమారు 2 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంలో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తామని, రైతులకు ధాన్యంపై క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం విదితమే.

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, ఖమ్మం నగరం

ఉభయ జిల్లాల్లో..

సన్నరకాలకు బోనస్ అందించే పథకాన్ని ఈ ఏడాది నుంచే అమలుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సన్నవడ్ల సాగు వైపే అన్నదాతలు మొగ్గుచూపారు. ఖరీఫ్ సీజన్‌లో ఖమ్మం జిల్లాలో సుమారు 1.20లక్షల మంది రైతులు 2,62,681 ఎకరాల్లో సన్నాలు సాగుచేస్తుండగా.. కేవలం 19,333 ఎకరాల్లో దొడ్డువడ్లను పండిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 84,938 మంది అన్నదాతలు 1.55 లక్షల సన్నరకాల సాగుకే జైకొట్టారు. గత రబీ సీజన్‌లో సైతం ఉభయ జిల్లాల్లోని రైతులు అధికమొత్తంలో సన్నరకాలు సాగుచేయటం విశేషం. డిమాండ్ ఉండటం, వ్యాపారులు పంట పొలాల్లోనే ధాన్యం కొనుగోలు చేయటం వంటి కారణాలతో రైతుల సన్నాల సాగుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించటంతో అన్నదాతలకు మరింత మేలు జరగనుంది.

నవంబర్ నుంచి కొనుగోళ్లు

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనాలని భావిస్తున్న ప్రభుత్వం.. పంటలు చేతికొచ్చే కాలాన్ని బట్టి అక్టోబరు మొదటి వారం నుంచి రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించింది. నవంబర్ మొదటి వారంలో భద్రాద్రి జిల్లాలో, నాలుగో వారంలో ఖమ్మం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. దొడ్డు, సన్నరకం వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన సన్నవడ్లను మరాడించి రేషన్ దుకాణాల ద్వారా అందించనున్నారు. గతంలో ఉభయ జిల్లాల్లో అవకతవకలకు పాల్పడిన మిల్లులకు ఈసారి ధాన్యం కేటాయించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోనున్నారు.

దిగుబడి తగ్గినా..

సాధారణంగా దొడ్డు రకాలతో పోల్చితే సన్నవడ్ల దిగుబడి తక్కువ. సాగు వ్యవధి, చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. అయితే ధర విషయంలో సన్నాలకు కలిసొస్తుంది. గత రబీ సీజన్‌లో దొడ్డు రకాల కంటే ప్రైవేట్ మార్కెట్‌లో సన్న రకాలకు రూ.500 నుంచి రూ.600 అధికంగా ధర లభించింది. రైతులు పండించిన సన్న వడ్లను ప్రైవేటు వ్యాపారులే కొనుగోలు చేశారు. దీనికి తోడు ఇంటి అవసరాలకు రైతులు కొంత ధాన్యాన్ని దగ్గర పెట్టుకోవటంతో ప్రభుత్వానికి అవసరమైన సన్నవడ్లు మార్కెట్‌లో దొరకటం లేదు. అందుకే ప్రభుత్వం.. సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. ఉభయ జిల్లాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులకు దిగుబడి తగ్గినా.. మద్దతు ధర, బోనస్ లభిస్తుండటంతో లాభాలు ఆర్జించే అవకాశముంటుంది.

మున్నేరు రక్షణ గోడల నిర్మాణంలో మార్పులు: తుమ్మల

ఈటీవీ, ఖమ్మం: ఖమ్మం నగరంలో మున్నేరుకు రెండువైపులా చేపట్టిన రక్షణ గోడల నిర్మాణంపై నిపుణుల సూచనలు పాటిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మరో వందేళ్ల ఏళ్ల పాటు ఎంత వరద వచ్చినా ఇబ్బందులు కలగకుండా నిర్మాణం చేపడతామని తెలిపారు. త్వరలోనే నిపుణుల కమిటీ మున్నేరును పరిశీలించి రక్షణ గోడలు ఎలా నిర్మించాలి, ఎంత పొడవు ఉండాలనే అంశాలపై అధ్యయనం చేస్తుందని చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత డిజైన్ ప్రకారం రక్షణ గోడల నిర్మాణం జరగబోదని స్పష్టం చేశారు. మున్నేరు వరదలతో ప్రకాశ్‌నగర్ వంతెనలోని 24 స్పాన్లు పక్కకు జరిగాయని, తొమ్మిది స్పాన్లు దెబ్బతిన్నాయని వెల్లడించారు. దెబ్బతిన్న ఒక్కో స్పాన్‌ను యథాతథ స్థితికి తీసుకురావటానికి పది రోజుల సమయం పడుతుందని తెలిపారు. హైడ్రాలిక్ సిస్టంతో స్లాబులను కూర్చోబెట్టాల్సి ఉందన్నారు. పది రోజుల్లో పనులు మొదలుపెట్టి వంద రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలకుండా మున్నేరు పాత చప్టాపై నుంచి రాకపోకలు సాగించే ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఖమ్మం నగరంలో అక్రమ నిర్మాణాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఖమ్మంలో గతంలో వరద కాల్వలు, నదుల ప్రవాహం ఎలా ఉండేదనే అంశంపై నేషనల్ రిమోట్ సెన్సెస్ అధ్యయనం చేసి నివేదిక ఇస్తుందని తెలిపారు. తదనంతరం శాటిలైట్ చిత్రాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒక్క సెంటీమీటర్ జాతీయ రహదారులు లేని ఉమ్మడి ఖమ్మం జిల్లా.. ఇప్పుడు రాష్ట్రంలోనే అత్యధిక జాతీయ రహదారులతో భాసిల్లుతోందని పేర్కొన్నారు. ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి నిర్మాణ పనులను ఉగాది వరకు పూర్తి చేస్తామన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ శ్రీజ, జలవనరులశాఖ సీఈ విద్యాసాగర్, ఆర్‌అండ్‌బీ సీఈ మోహన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మద్యపానాన్ని నిషేధిస్తూ తీర్మానం

కరకగూడెం, న్యూస్‌టుడే: మద్యపానాన్ని నిషేధిస్తూ కరకగూడెం మండలం చిరుమల్ల, వట్టంవారిగుంపు గ్రామ పంచాయతీల్లో మహిళలు మంగళవారం తీర్మానం చేశారు. తీర్మాన ప్రతులను పంచాయతీ కార్యాలయం, తహసీల్ కార్యాలయం, కరకగూడెం ఠాణాలో అందజేశారు. ఆయా గ్రామాల్లో మద్యపానం, గుడుంబా విచ్చలవిడిగా లభిస్తోందని, ప్రజలు అనారోగ్యం బారినపడి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళలు తెలిపారు. కొద్ది రోజులుగా మద్యం తాగిన వారి కారణంగా గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. ఈనేపథ్యంలో గ్రామ పెద్దల సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు వెల్లడించారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.50 వేలు జరిమానా విధించనున్నట్లు తీర్మానించారు. సునీత, సోనియా, రాణి, మనీష, రమాదేవి, రాజేశ్వరి, రోజా, నాగమణి, ఈశ్వరి, సరోజన, ఉదయ తదితరులు పాల్గొన్నారు.


కరకగూడెం తహసీల్దారుకు తీర్మాన ప్రతి అందిస్తున్న మహిళలు, గ్రామస్థులు

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: దివ్యాంగ విద్యార్థులను స్క్రీనింగ్ పరీక్ష ద్వారా గుర్తించేందుకు రూపొందించిన 'ప్రశస్త' యాప్‌పై ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల ఉపాధ్యాయులకు బుధవారం నుంచి శుక్రవారం వరకు శిక్షణ ఉంటుందని డీఈఓ వెంకటేశ్వరాచారి మంగళవారం ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 8,325 మంది ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇస్తామన్నారు. షెడ్యూల్ ప్రకారం అన్ని మండలాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు.

పినపాక తహసీల్దారుపై సస్పెన్షన్ వేటు

పినపాక, న్యూస్‌టుడే: పినపాక తహసీల్దారు సూర్యనారాయణను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ మంగళవారం ఉత్తర్వులు వెలువరించారు. కోర్టు వివాదంలో ఉన్న భూమితోపాటు ఓ స్థలం పట్టా మార్పిడి విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించటంతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. సంబంధిత కుటుంబ సభ్యులకు కాకుండా మరో వ్యక్తికి పట్టా చేశారన్న ఫిర్యాదుతో కలెక్టర్ విచారణ చేపట్టారు. కోర్టు పరిధిలో ఉన్న భూమిని అధికార దుర్వినియోగానికి పాల్పడి మూడో వ్యక్తి పేరిట పట్టా చేశారనే అంశంలోనూ శాఖాపరమైన విచారణ సాగింది. తహసీల్దార్ సూర్యనారాయణకు ఆగస్టు 31న షోకాజ్ నోటీసును కలెక్టర్ జారీ చేశారు. దీనిపై తహసీల్దార్ ఈనెల 4న వివరణ సమర్పించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

ముంపు ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి పర్యటన


జలగంనగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: మున్నేరు వరద ముంపు ప్రాంతమైన రాజీవ్ గృహకల్ప, జలగంనగర్ ప్రాంతాల్లో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పర్యటించారు. ద్విచక్ర వాహనంపై తిరుగుతూ వరద బాధితులను పరామర్శించారు. సహాయక చర్యలు, ప్రభుత్వ సాయం గురించి ఆరా తీశారు. తమకు ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదని కొందరు బాధితులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అధికారులను పిలిచి ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందాలని, మరోసారి ఇంటింటి సర్వే చేపట్టి అర్హులను గుర్తించాలని మంత్రి ఆదేశించారు. అనర్హులకు పరిహారం అందడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వీధులన్నీ శుభ్రం చేసి దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లాలని సూచించారు. ముంపు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీఓ గణేశ్, తహసీల్దారు రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఎంపీఓ రాజారావు, కాంగ్రెస్ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, కళ్లెం వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, భుజంగరెడ్డి, శ్రీను, మహేశ్, అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలల్లో తక్షణ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ఐదో విడత తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ బడుగు ప్రభాకర్ మంగళవారం తెలిపారు. ఐటీఐ కళాశాలల్లో ప్రస్తుతం డ్రాఫ్ట్‌మెన్, సివిల్, డీజిల్ మెకానిక్, కోపా కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని, గతంలో దరఖాస్తు చేసి సీటు రానివారు ఇప్పుడు ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్ నమోదు చేసుకోవాలని చెప్పారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఐటీఐ కళాశాలల్లో చేరేందుకు ఈనెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాస్తవ లాభాల నుంచి బోనస్ ప్రకటించాలి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: వాస్తవంగా వచ్చిన లాభాల నుంచి సింగరేణి కార్మికులకు 33 శాతం వాటా ప్రకటించాలని భారాస, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీజీబీకేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఇల్లెందు పట్టణంలోని జగదాంబ సెంటర్ తెలంగాణతల్లి విగ్రహం వద్ద నిరసన ప్రదర్శనతోపాటు ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. భారాస వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ నమ్మి గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులను నట్టేట ముంచిందన్నారు. వాస్తవ లాభాల్లో కేవలం 16.9 శాతం వాటానే కార్మికులకు వస్తుందన్నారు. తెబొగకాసం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సుదర్శన రంగనాథ్ మాట్లాడుతూ గతేడాది సింగరేణికి రూ.2,222 కోట్ల లాభం వస్తే అందులో నుంచి 32శాతం పంపిణీ చేశామన్నారు. ఈసారి రూ.4701 కోట్ల లాభాలు వస్తే అందులో నుంచి రూ.2,389 కోట్లు అభివృద్ధి కోసమంటూ పక్కనబెట్టడంతో కార్మికులు నష్టపోయారని తెలిపారు. కార్యక్రమంలో సిలివేరి సత్యనారాయణ, దేవిలాల్‌నాయక్, కౌన్సిలర్ జేకే శ్రీను, పరుచూరి వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి రేణుక, మాజీ వైస్ ఎంపీపీ ప్రమోద్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న భారాస, తెబొగకాసం నాయకులు

ఇన్‌ఛార్జి ఎంఈఓల నియామకం

కూసుమంచి: పాఠశాలల పర్యవేక్షణలో కీలకమైన ఎంఈవోల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఒక్కో ఎంఈఓ మూడు నుంచి నాలుగు మండలాల బాధ్యతలు నిర్వర్తించాల్సి రావటంతో పరిస్థితి గాడి తప్పుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి మండలానికి పర్యవేక్షకులు ఉండాలని ప్రభుత్వం భావించింది. మండలంలో సీనియర్ ఉపాధ్యాయులకు ఇన్‌ఛార్జి ఎంఈఓల బాధ్యతలు అప్పగించింది. భద్రాద్రి జిల్లాలో మండలాల వారీగా నియమితులైన ఇన్‌ఛార్జి ఎంఈఓల వివరాలు.. కొత్తగూడెం-ప్రభుదయాల్, ములకలపల్లి-జి.సత్యనారాయణ, ఆళ్లపల్లి-కె.శాంతారావు, దుమ్ముగూడెం-ఎస్.సమ్మయ్య, దమ్మపేట-కె.లక్ష్మి, పినపాక-కె.నాగయ్య, చంద్రుగొండ-ఎం.సత్యనారాయణ, జూలూరుపాడు-బి.జంకీలాల్, టేకులపల్లి-ఎ.జగన్, చుంచుపల్లి-బి.బాలాజీ, పాల్వంచ-ఎ.శ్రీరామమూర్తి, గుండాల-కె.పార్వతమ్మ, భద్రాచలం-టి.రమ,అశ్వారావుపేట-పి.ప్రసాదరావు, అశ్వాపురం-వి.వీరస్వామి, అన్నపురెడ్డిపల్లి-యు.ఆనందకుమార్, లక్ష్మీదేవిపల్లి-పి.కృష్ణయ్య, సుజాతనగర్-ఎల్.లీల, ఇల్లెందు-టీవీఆర్ఎన్‌స్వామి, బూర్గంపాడు-ఎం.యదుసింహరాజు, చర్ల-పి.వి.రమణ, మణుగూరు-జి.స్వర్ణజ్యోతి, కరకగూడెం-జి.మంజుల.

పొగాకు అనర్థాలపై అవగాహన పెంపొందించాలి

కొత్తగూడెం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: పొగాకు వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్ సూచించారు. 'టుబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0' కార్యక్రమంలో భాగంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రోగ్రాం అధికారులు బాలాజీ, మధువరుణ్, స్వప్న, స్పందన, కళ్యాణ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత పాల్గొన్నారు.

30న 'రోల్ ప్లే' పోటీలు

కొత్తగూడెం విద్యావిభాగం: పాత కొత్తగూడెం ఆనందఖనిలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో 'రోల్ ప్లే' పోటీలను సోమవారం నిర్వహించనున్నట్లు డీఈఓ వెంకటేశ్వరాచారి మంగళవారం ప్రకటించారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, కేజీబీవీల్లో అభ్యసిస్తున్న 8, 9వ తరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. పాఠశాల ఏకరూప దుస్తులతో వేదికపై కేవలం ఆంగ్లంలోనే సంభాషించాలని తెలిపారు. విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల సమాచారాన్ని జిల్లా మానటరింగ్ అధికారి నాగరాజశేఖర్‌కు శనివారం నాటికి చేరవేయాలని సూచించారు.

పంటల నమోదు తప్పనిసరి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: పంటల నమోదు తప్పనిసరని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సూచించారు. మణుగూరు పట్టణంలోని అన్నారంలో పంట నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో భాగంగా ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలంటే రైతులు తప్పనిసరిగా పంటల వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదు జరిగిన రైతులు మాత్రమే ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారన్నారు. త్వరలో డిజిటల్ క్రాప్ సర్వే కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఏడీ ఛటర్జీ, ఏఈఓ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు తదితరులు

వన్నె తీసుకురాని గిన్నెలు!

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం ఐటీడీఏ డీడీ కార్యాలయం పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు వంటపాత్రలను ఇప్పటికే అందించాల్సి ఉండగా ఈ పనిని జాప్యం చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో మొత్తంగా 63 విద్యాలయాలకు రూ.60 లక్షల విలువైన ఈ పాత్రలను చేరవేయాల్సి ఉంది. టెండరు పొందిన వ్యాపారులు డీడీ కార్యాలయ గోదాముకు వాటిని తరలించారు. ఇది స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో ఉంది. వీటిలో 5 కిలోలు వంట చేసే గిన్నెల నుంచి 30 కిలోల అన్నం వండే పాత్రలు వరకు ఉన్నాయి. వీటిని ఆయా పాఠశాలలకు చేరవేసి నాణ్యతపై దృష్టి సారించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

స్టోర్స్ విభాగంలో బకాయిలు..

డీడీ కార్యాలయంలో రూ.కోట్ల లావాదేవీలను నిర్వహించే స్టోర్స్ విభాగం చాలా కీలకమైనది. విద్యార్థులకు అందించే సంక్షేమంలో ఎక్కువ భాగం ఇక్కడ నుంచే సమకూరుతుంది. గుత్తేదారులు, వ్యాపారులు విద్యార్థులకు అవసరమైన వాటిని సరఫరా చేస్తుండగా నిబంధనల ప్రకారం వీరికి చెల్లింపులు చేస్తుంటారు. దాదాపు ఏడాది నుంచి చెల్లింపులు సక్రమంగా చేయకపోవడంతో ఈ విభాగం సదరు వ్యాపారులకు రూ.2 కోట్లకు పైగా బకాయి పడింది. ఇదే కొనసాగితే సంక్షేమంలో నాణ్యత కొరవడే ప్రమాదం పొంచి ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

దృష్టి సారించాల్సిన అంశాలు

★ చెప్పులు, బూట్లు 22 వేల మందికి ఇచ్చారు. ఇవి కాకుండా మరో 3వేల మంది విద్యార్థులకు వారి కాలు సైజు ప్రకారం బూట్లు అందాలి.
★ 8 నుంచి 10వ తరగతి చదివే బాలికలకు రాత్రిపూట ధరించే దుస్తులు అందించారు. బాలురకు ఇవి రాలేదు. ఎప్పుడిస్తారో స్పష్టత లేదు.
★ దాదాపు 18 వేల మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున దుస్తులు అందించారు. ఇంకా ఆరేడు వేల మందికి దుస్తులు చేరలేదు.
★ 250 మంది దర్జీలు దుస్తులు కుడుతున్నారు. ప్రతి జతకు వారికి కుట్టుకూలి రూ.100 చెల్లిస్తారు. పాత బకాయి కొంత జమ చేసినా ఇంకా రూ.18 లక్షలను దర్జీలకు చెల్లించాలి.


ఐటీడీఏ డీడీ కార్యాలయ గోదాములో గిన్నెలు

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..

రమణమ్మ, స్టోర్స్ ఇన్‌ఛార్జి

విద్యార్థులకు అవసరమైన దుస్తులు, బూట్లు అందించాం. బిల్లులు మంజూరైన వెంటనే కుట్టుకూలి డబ్బులు చెల్లిస్తాం. గిన్నెలను విద్యాలయాల నిర్వాహకులకు అప్పగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.





టేకులపల్లి పంచాయతీ ఆవరణలో ఎకోబ్రిక్స్‌తో నిర్మించిన మొక్కల కుండీ, బస్‌షెల్టర్‌పై...

వ్యర్థం.. ఉపయోగార్థం

టేకులపల్లి, న్యూస్‌టుడే

ప్లాస్టిక్‌ వ్యర్థాలు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌ సీసాలు, పాలిథిన్‌ కవర్లు కుప్పలుతెప్పలుగా దర్శనమిస్తున్నాయి. భద్రాద్రి జిల్లా కలెక్టర్‌ జితేశ్‌ వి పాటిల్‌ తాను పాల్గొనే ప్రతి సమావేశంలో ప్లాస్టిక్‌ నియంత్రణ ప్రాధాన్యం గుర్తుచేస్తున్నారు. ప్లాస్టిక్‌ సీసాల్లో పాలిథిన్‌ కవర్లను నింపి వాటి సాయంతో ఎకో బ్రిక్‌ తయారు చేసుకోవాలని సూచించారు. టేకులపల్లి పంచాయతీ కార్యదర్శి దీప్తి, కలెక్టర్‌ ఆలోచనకు కార్యరూపమిచ్చారు. వృథాగా పడేసిన నీళ్ల, శీతల పానీయ సీసాలను పంచాయతీ కార్మికుల సాయంతో సేకరించారు. వాటిలో వాడి పడేసిన పాలిథిన్‌ కవర్లు బిగుతుగా నింపి ఎకోబ్రిక్‌లను తయారు చేయించారు. ఆకర్షణీయ రంగులతో ఎకోబ్రిక్‌లతో కుండీలు రూపొందించి మొక్కలను నాటించారు. బస్‌షెల్టర్‌ ప్యాంగణంలో చిన్నచిన్న కుండీలను ప్రవేశద్వార తలుపులో ఏర్పాటు చేసి పూలమొక్కలను నాటారు. చూడగానే వెదురు కర్రలతో తయారైనట్లు కనిపిస్తున్నాయి. చాలా తక్కువ ఖర్చుతో ఎకోబ్రిక్స్‌తో ఉపకరణాలను తయారు చేసి ప్రయోగాత్మకంగా చూపిన పంచాయతీ కార్యదర్శి దీప్తిని కలెక్టర్‌ అభినందించారు.



ఎకోబ్రిక్స్‌ నిర్మాణం చేస్తున్న పంచాయతీ కార్మికులు

‘ప్రజలు సైతం ఎకోబ్రిక్స్‌ సాయంతో ఇళ్లలో చిన్నచిన్న కుండీలను తయారు చేసుకోవచ్చు. సామూహిక ఆచరణతో ప్లాస్టిక్‌ నియంత్రించే అవకాశం ఉంటుంది. పర్యావరణ ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు బహిరంగ ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేశాం.’

- దీప్తి, పంచాయతీ కార్యదర్శి

30న యువజనోత్సవాలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి యువజనోత్సవాలు 30న ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల వారు పాల్గొనేందుకు అర్హులన్నారు. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన కళాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని, అక్కడా ప్రతిభ నిరూపించుకున్న వారు జనవరి 12 నుంచి 16 వరకు జరిగే జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీ అంశాల్లో జానపద నృత్యం, జానపద గేయం, వ్యాసరచన, పోస్టర్‌ తయారీ, వక్తృత్వం, కవిత్వం ఉన్నాయి. ఇదే ప్రాంగణంలో సైన్స్‌ మేళా ఉంటుంది. సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ కొత్త ఆవిష్కరణలు ప్రదర్శించే అవకాశం ఉంది. యువశక్తి పేరుతో నిర్వహించే పోటీల్లో హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రావీణ్యం చూపిన ఇద్దరిని ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఆసక్తిగల యువ కళాకారులు, సైన్స్‌ఫేర్‌ ఔత్సాహికులు 29వ తేదీలోగా ఖమ్మం సర్దార్‌ పటేల్‌ స్టేడియంలోని యువజన క్రీడల కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఇతర వివరాలకు 99482 07271 నంబరుకు సంప్రదించాలని అధికారి కోరారు.

వినూత్న విధానం.. లాభాలు సమీకృతం

పత్తి: ఖమ్మం గ్రామీణం మండల తనగంపాడుకు చెందిన ఓ రైతు రెండెకరాల్లో సాగుచేసిన పత్తి పంట ప్రకృతి వైపరీత్యంతో చేతికందకుండా పోయింది. రూ.80 వేల నష్టం మిగిలింది.

వరి: చింతకాని మండలం చిన్నమండవకు చెందిన మరో రైతు నాలుగెకరాల్లో చేసిన వరి ఇటీవల మున్నేరు వరదలతో దెబ్బ తింది. ఎకరాకు రూ.25-రూ.30 వేల పెట్టుబడి నష్టపోయాడు.

మిరప: కామేపల్లి మండలంలోని పండితాపురంలో 3 ఎకరాల్లోని మిరప మొక్కలను రైతు ఇటీవల దున్నేశారు. అధిక వర్షాలకు వేరు కుళ్లు వచ్చి రూ.50 వేలు నష్టపోయాడు.



‘సమీకృత వ్యవసాయం’ నమూనా (ఎకరా విస్తీర్ణంలో)

10 గుంటలు	మునగ, బొప్పాయి, కోకో, ఆయిల్‌పాం, అవకాడో, పనస చెట్ల పెంపకం
10 గుంటలు	స్తంభాలపై డ్రాగన్, జాక్‌ ఫ్రూట్‌ పండ్ల చెట్ల సాగు
10 గుంటలు	తీగజాతి సొరకాయ, మిరప, పసుపు తోటల పెంపకం
10 గుంటలు	సోలార్‌ యూనిట్, ఆక్వా వ్యవస్థ, సేంద్రియ ఎరువుల తయారీ వ్యవస్థ, కోళ్లు/కౌజుపిట్టలు/బాతుల షెడ్, పుట్టగొడుగుల షెడ్, తేనె టీగల పెంపకం, వెదురు కాటేజీ

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

పత్తి, మిరప, మొక్కజొన్న వాణిజ్య పంటలు, వరి వంటి వాటిని సంప్రదాయ పద్ధతుల్లో ఏళ్లుగా సాగుచేయడం వల్ల నేల సారం క్షీణించిపోతోంది. పంట మార్పిడి పాటించకపోవడం, విచ్చలవిడిగా రసాయనాలను పిచికారీ చేయడం, ఎరువులను గుప్పడం, ప్రకృతి విపత్తులు.. వెరసి సాగు రాన్రాను భారమైపోతోంది. సానుకూల వాతావరణంలోనూ పత్తి, వరి, మొక్కజొన్నకు ఎకరాకు రూ.20 వేలు మించి ఆదాయం మిగలడం లేదు. ఇలాంటప్పుడు మూస ధోరణల్లోంచి బయటపడాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌ జితేశ్‌ వి పాటిల్‌ సూచిస్తున్నారు. ఆయన వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో అధ్యయనం చేసి.. ‘సమీకృత వ్యవసాయం’ నమూనా రూపొందించారు. పలు పథకాల సాయంతో ఎకరాలో ప్రయోగాత్మక సాగు లాభదాయకమని విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.. తన రెండెకరాల కొబ్బరి తోటలో అంతరపంటగా మునగ సాగుకు ముందుకొచ్చారు. ములకలపల్లి మండలంలో పలువురు రైతులు సమీకృత వ్యవసాయంతో లాభాలు గడిస్తున్నారు.

మునగ: ఎకరా మునగ తోట సాగుకు ఉపాధి హామీ పథకం నుంచి అర్హత గల రైతుకు రూ.1.22 లక్షల సాయం అందుతుంది. 10 నెలల వరకు నిర్వహణ ఖర్చులూ అందుతాయి. పీకేఎం౧ రకం మునగ చెట్టు ఏడాదికి 200 కాయలు కాస్తుంది. ఎకరాలో 30 టన్నుల దిగుబడి వస్తుంది. సగటున టన్ను రూ.8 వేల ధర పలుకుతుంది. గింజల నుంచి తయారుచేసే నూనె ధర లీటరు రూ.3 వేలు ఉంటుంది. ఆకుల నుంచి పచ్చడి, పొడి తయారు చేయొచ్చు. ఈ సాగు.. పత్తి రైతులకు మంచి ప్రత్యామ్నాయం.

అజొల్లా, చేపలు, బాతుల పెంపకం: నీటి వనరులతో వరి పొలాలున్నవారు ఉపాధి పథకం సాయంతో ఫారం పాండ్‌ను 2-4 గుంటల్లో ఉచితంగా తవ్వుకోవచ్చు. కొర్రమేను చేపలు పెంచవచ్చు. పిల్లలకు అజొల్లాను దాణాగా వేయవచ్చు. అజొల్లాను పొలం, చెట్లకు ఎరువుగా, పశువుల మేతగా వాడొచ్చు. బాతులను పెంచవచ్చు. పక్కనున్న పొలాల్లో ఇవి పురుగులు తింటాయి. నీటిని కదిలిస్తాయి. కలుపు నివారణకు దోహదపడతాయి. వాటి వ్యర్థాలు వరికి ఎరువవుతాయి. వరి సాగుదారులకు ఈ విధానం.. అనుకూలం. నీటి వసతి లేని వారైతే మునగ సాగుతో ఆదాయం పొందొచ్చు.

ఎన్‌ఎస్‌పీ స్థలం.. ఆక్రమణల పర్వం..!

వైరా పాతతండా రైతు వేదిక సమీపంలో విలువైన ఎన్‌ఎస్‌పీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. గతంలో ఎన్‌ఎస్‌పీ కాలువ ఉన్న స్థలంలో ఏడాది క్రితం పట్టణ దవాఖానా నిర్మించారు. ఇంకా విలువైన స్థలం ఉండటంతో గత రెండు రోజులుగా స్థానికులు కొందరు ఆక్రమణకు యత్నిస్తున్నారు. ఆ ప్రయత్నమే ఈ చిత్రం. ఇప్పటికే మధిర రోడ్డు సమీపంలోని రూ.కోట్ల విలువైన ఎన్‌ఎస్‌పీ స్థలాలు కొన్నేళ్ల క్రితమే కబ్జాకు గురయ్యాయంటే అతిశయోక్తికాదు. ప్రస్తుతం రైతు వేదిక నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వెళ్లే వైపు ఇదే ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. వంద గజాలు కొనాలంటే రూ.లక్షల్లో పలుకుతుండటంతో ఆక్రమణలకు అడ్డులేకుండా పోతుంది. ఈ విషయమై తహసీల్దార్‌ శ్రీనివాస్‌ను ‘న్యూస్‌టుడే’ సంప్రదించగా.. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

– వైరా, న్యూస్‌టుడే



ఎన్‌ఎస్‌పీ స్థలం చుట్టూ కట్టిన రిబ్బన్లు

మెట్టినింటికి అమెరికా కోడలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉన్నత కొలువు కోసం అమెరికా వెళ్లిన ఇల్లెందు పట్టణానికి చెందిన ఓ యువకుడు అక్కడి యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ అమెరికా కోడలు మంగళవారం అత్తవారింటికి చేరింది. ఇల్లెందు పట్టణం ఎనిమిదో వార్డుకు చెందిన భోగ నందకిశోర్‌-విజయ దంపతుల కుమారుడు రాహుల్‌కిశోర్. బెంగళూరులో ఐఐఎం పూర్తి చేసి ఓ ఎంఎన్‌సీలో కొలువు సాధించి కంపెనీ తరపున 2019లో అమెరికాలోని బోస్టన్‌ వెళ్లారు. అక్కడ ఉద్యోగం చేస్తూ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తున్న అమ్మాయి సోషానతో ప్రేమలోపడ్డాడు. గత డిసెంబరులో ఇరుకుటుంబాల అంగీకారంతో అమెరికాలో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. భారతీయ సంస్కృతిపై ఉన్న మక్కువతో దేశంలోని ఆలయాలు, ఇతర ప్రాంతాలు చూసేందుకు ఈ జంట స్వదేశానికి చేరుకున్నారు. మంగళవారం స్థానిక రామాలయంలో పూజలు నిర్వహించారు.



ఇల్లెందు రామాలయంలో రాహుల్‌కిశోర్‌ దంపతులు

నిరంతర శ్రమతోనే విజయం

మధిర, న్యూస్‌టుడే: విద్యార్థులు నిరంతరం శ్రమించి చదివితేనే ఉన్నతస్థాయికి ఎదగవచ్చని హైదరాబాద్‌ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మడుపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో మంచి పౌరులుగా రాణించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు పి.నర్సింహారావు జ్ఞానేశ్వరాచారి, కోటేశ్వరరావు, ఆదాం, కిశోర్, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్ల వీర విహారం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: పటేల్‌ స్టేడియంలోని అథ్లెటిక్స్‌ శిక్షణ కేంద్రంలోని క్రీడాకారులు ఇటీవల హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో పతకాల పంట పండించారు. మొత్తం 11 మంది క్రీడాకారుల జట్టు 17 పతకాలు సాధించుకొచ్చారు. ఇందులో 5 స్వర్ణాలు, 6 రజతాలు, 6 కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాలు సాధించిన క్రీడాకారులు గోపీచంద్, మస్తాన్, అశోక్, ఆఫ్తాబ్, ముబిన్, వివేక్‌ చంద్ర, వైశాలి, మనుశ్రీ, బిందు, అఫ్రీన్, కృష్ణవేణిలను మంగళవారం ఖమ్మం స్టేడియంలో డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి అభినందించారు. శిక్షకులు గౌస్, అలీం, సుధాకర్‌ పాల్గొన్నారు.



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి

తపాలా శాఖ సేవలపై అవగాహన కల్పించండి

పినపాక, న్యూస్‌టుడే: తపాలా శాఖ సేవలపై గ్రామస్థాయిలో ప్రజలందరికీ అవగాహన కల్పించాలని ఆ శాఖ ఖమ్మం డివిజన్‌ ఎస్పీ(సూపరింటెండెంట్‌ ఆఫ్‌ పోస్ట్‌) వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఉప్పాక వంతెన వద్ద ఓ ప్రైవేటు వేదికలో మంగళవారం నిర్వహించిన బ్రాంచి పోస్టుమాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నమొత్తాల పొదుపు, బీమా, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్‌ తరహా సేవలందిస్తున్న ఇండియన్‌ పోస్టల్‌ పేమెంట్‌ బ్యాంక్‌ ఖాతాలు తెరవాలని సూచించారు. ఐపీపీబీ మేనేజర్‌ రాజేశ్, మణుగూరు సబ్‌డివిజన్‌ అధికారి రామమూర్తి, ఎంవోలు సత్యనారాయణ, సుధీర్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ వీరభద్రస్వామి

319 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణ శివారులో వాహన తనిఖీల్లో రూ.79.75 లక్షల విలువైన 319 కిలోల గంజాయి, రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆబ్కారీ అధికారులు జనార్దన్‌రెడ్డి, గణేశ్, జానయ్య, తిరుపతి, కరంచంద్‌ విలేకరుల సమావేశంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దుల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా వేర్వేరు ఘటనల్లో ఈ గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. వాహనాలతో కలిపి మొత్తం విలువ రూ.1 కోటి ఉంటుందని పేర్కొన్నారు.

★ పెద్దపల్లి జిల్లా కొత్తపల్లికి చెందిన తల్లీకొడుకు నేరళ్ల అపర్ణ, నేరేళ్ల అఖిల్‌ కారులో హైదరాబాద్‌ తరలిస్తున్న 100 కిలోల గంజాయిని భద్రాచలం వద్ద సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కేసుతో సంబంధమున్న పాత నేరస్థుడు నిజామాబాద్‌కు చెందిన మునావర్‌ అలీని అదుపులోకి తీసుకున్నారు.

★ ఏపీలో మోతుగూడెం సరిహద్దు ప్రాంతాల నుంచి కారులో అక్రమంగా తరలిస్తున్న 180 కిలోల గంజాయిని సోమవారం పట్టుకుని హైదరాబాద్‌ బేగం బజార్‌కు చెందిన దత్తు పంచాలను అదుపులోకి తీసుకున్నారు. మరో కేసులో హైదరాబాద్‌ ఫతేనగర్, బాలానగర్‌కు చెందిన శక్తి రాహల్, ఇరువురు గోపిశెట్టి అక్షిత్‌ల నుంచి 14 కిలోలు, 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. తనిఖీల్లో సీఐ రహీమున్నీసాబేగం, ఎస్సైలు అల్లూరి సీతారామరాజు, గౌతమ్, సిబ్బంది బాబు, రాకేశ్, వీరబాబు, కిరణ్, మనోహర్, వెంకట్, లలిత, నీలవేణి, జమాల్, ఆలీ పాల్గొన్నారు.

హైదరాబాద్‌: నిజామాబాద్‌కు చెందిన పాత నేరస్థుడు మునావర్‌పై 2013, 2017, 2018లలో నిజామాబాద్‌ రూరల్‌ నాలుగో ఠాణా, రైల్వే ఠాణాలతోపాటు ఉమ్మడి వరంగల్‌ జిల్లా బచ్చన్నపేట, ఏపీలోని తూర్పుగోదావరి, విజయవాడల్లో కేసులు ఉన్నట్లు ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టర్‌ కమలాసన్‌రెడ్డి వెల్లడించారు.



పట్టుపడిన గంజాయి, నిందితులతో అధికారులు, సిబ్బంది

ఘనంగా సీతారామ కల్యాణం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి అర్చన చేశారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన రామయ్య ఇక్కడ దర్శనం ఇవ్వడం భక్తులు చేసుకున్న అదృష్టమని వైదిక పెద్దలు ప్రవచించారు. వైష్ణవ సంప్రదాయం మేరకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. మంగల్యధారణ కనుల పండువగా సాగింది. అక్షితలను భక్తులకు చూపించి తలంబ్రాల వేడుకను నిర్వహించారు. దర్బారుసేవ వైభవోపేతంగా సాగింది. ఆంజనేయ స్వామివారికి అభిషేకం నిర్వహించి అర్చన చేశారు. జైశ్రీరాం జైహనుమాన్‌ అంటూ నీరాజనాలు పలికారు. సింధూర బొట్టును నుదట ధరించి భక్తులు హనుమాన్‌ చాలీసాను పఠించారు. బుధవారం తిరుమంజనం ఉంటుంది.




విద్యుదాఘాతంతో రైతు మృతి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: చెరువుమాదారం గ్రామానికి చెందిన పరిటాల లింగయ్య(56) మంగళవారం విద్యుత్తు షాక్‌తో మరణించాడు. తన వ్యవసాయ క్షేత్రం సమీపంలోని విద్యుత్‌ స్తంభం వద్ద మోటారు కోసం తీగలు తగిలించబోగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. తన కుమారుడు చేలో ఎరువు చల్లుతుండగా తాను విద్యుత్‌ మోటారు సరిచేస్తానని వెళ్లి మృత్యువాత పడ్డాడు. అప్పటిదాకా చేలో పనిచేసిన లింగయ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడున్నారు.

సైబర్‌ నేరం.. రూ.73 వేలు మాయం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా పేరుతో వచ్చిన లింక్‌ను క్లిక్‌ చేయడంతోపాటు, వివరాలు నమోదు చేసిన ఓ ఉపాధ్యాయుడు రూ.73 వేలు పోగొట్టుకున్న సంఘటన ఖమ్మం నగరంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానిక మధురానగర్‌లో నివసించే ఉపాధ్యాయుడు కోటయ్య కథనం ప్రకారం... ఆయన వాట్సాప్‌కు సోమవారం రాత్రి ఎస్‌బీఐ పేరుతో లింక్‌ వచ్చింది. బ్యాంకు నుంచే వచ్చిందని నమ్మిన ఆయన ఓపెన్‌ చేసి ఖాతా, డెబిట్‌ కార్డు నంబర్లను నమోదు చేశారు. ఆ వెంటనే ఆయన ఖాతా నుంచి రూ.73,950 నగదు డ్రా అయినట్లు సంక్షిప్త సందేశం వచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఆయన బ్యాంకు అధికారులను మంగళవారం సంప్రదించారు. అది తాము పంపింది కాదని, సైబర్‌ నేరస్థులు పంపిన తప్పుడు లింక్‌ అని చెప్పడంతో ఖిన్నుడయ్యారు. నగదు డ్రా అయిన అనంతరం పిన్‌ నంబర్‌ అంటూ వందకుపైగా సంక్షిప్త సందేశాలు వచ్చాయన్నారు. తన తల్లి పేరిట కూడా బ్యాంకు ఖాతా ఉందని, దాని నుంచి నగదు డ్రా కాలేదని గుర్తించి, ఎటువంటి లావాదేవీలు జరుగకుండా నిలుపుదల చేయించారు. ఘటనపై ఖానాపురం హవేలి, సైబర్‌ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కోటయ్య తెలిపారు.

చికెన్‌ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్‌ ఫారం లిఫ్టింగ్‌ ధర -121 రిటైల్‌ ధర 143 చికెన్‌ విత్‌ స్కిన్‌ - 207, చికెన్‌ స్కిన్‌లెస్‌ - 236.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
పత్తి	5,500	7,311	6,800
పెసలు	4,000	7,312	6,700
ఏసీ ఎండుమిరప	10,000	20,000	18,000
ఎండుమిరప	8,000	18,500	17,300
ఏసీ తాలుమిరప	9,000	9,000	9,000

నాలుగు వరుసలు.. తీరిన కష్టాలు



సుందరంగా తయారైన కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే

అత్యంత రద్దీగా ఉండే అంతర్‌ జిల్లా రహదారుల్లో ఖమ్మం- కోదాడ మార్గం ఒకటి. వైద్య, విద్య, ఇతరత్రా అవసరాల కోసం కోదాడ పరిసర ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో ఖమ్మానికి వస్తుంటారు. గ్రానైట్, సిమెంటు, ధాన్యం, సున్నపురాయి తదితర వాణిజ్య, ఆహార ముడిపదార్థాల రవాణా ఈ మార్గంలో భారీగా అవుతుంది. గతుకుల రోడ్డులో వాహన రద్దీతో నిత్యం ప్రమాదాలూ సంభవించేవి. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం జాతీయ రహదారి (356ఏ) విస్తరణ పనులకు అంకురార్పణ జరిగి దాదాపు నిర్మాణం పూర్తి చేసుకుంది. సూర్యాపేట జిల్లా కోదాడ వద్ద విజయవాడ-హైదరాబాద్‌ జాతీయ రహదారికి అనుసంధానంగా ప్రారంభమై ఆ జిల్లాలోని అనంతగిరి, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం గ్రామీణ మండలాల మీదుగా వెంకటగిరి క్రాస్‌ రోడ్డు వద్ద జాతీయ రహదారుల రింగ్‌ రోడ్‌కు కలుస్తుంది.

1 తుమ్మల కృషి

ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అప్పటి కేంద్ర ఉపరితల రహదారి మంత్రి నితిన్‌ గడ్కరీని కలిసి కోదాడ-ఖమ్మం హైవే మంజూరు చేయాలని విన్నవించారు. అప్పటికే అమరావతి-నాగపూర్‌ రహదారి మంజూరవటం, ఖమ్మం-సూర్యాపేట రహదారి నిర్మాణ దృష్ట్యా ఈ ప్రతిపాదన పక్కనపెట్టేశారు. మంత్రి తుమ్మల పట్టుబట్టిమరీ సాధించారు.

2 రైతుల త్యాగం

రహదారి నిర్మాణానికి ఇరు జిల్లాల్లో 1300 మంది రైతులు 160 హెక్టార్ల భూములు త్యాగం చేశారు. విలువైన భూములను చాలా ఎక్కువ సేకరించారని, పరిహార విషయంలో కొంత అన్యాయం జరిగిందని రైతులు పేర్కొన్నా.. క్షేత్రస్థాయిలో అధికారులు పరిస్థితులు చక్కదిద్దారు.

3 వేగంగా నిర్మాణం

రహదారి నిర్మాణానికి 2021లో టెండరు పిలవగా అదానీ సంస్థ దక్కించుకుంది. దీన్ని పవర్‌మెక్‌ సంస్థ ద్వారా పూర్తిచేయించింది. మొత్తంగా 14 వంతెనలు నిర్మించారు. సుదీర్ఘకాలం పనులతో ఇబ్బంది పడుతున్నామని పైనంపల్లిలో పలుమార్లు స్థానికులు అడ్డుకున్నారు. నిర్మాణానికి వేల టన్నుల మట్టి అవసరమైంది. సుమారు 1000 మందికిపైగా కార్మికులు, వందలాది యంత్రాలు, ప్రైవేటు ఇంజినీర్లు పనిచేశారు. ఒకానొక దశలో మట్టి కొరత ఏర్పడటంతో కలెక్టర్లు చెరువులు, కుంటలు, గుట్టలు, క్వారీల నుంచి మట్టిని సేకరించారు.

ప్రాజెక్టు స్వరూపం

మొత్తం నిడివి: 31.05 కి.మీ.

జిల్లాలు: సూర్యాపేట (కోదాడ, అనంతగిరి), ఖమ్మం (నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం గ్రామీణం)

అండర్‌ పాస్‌లు: 14

నిర్మాణ వ్యయం: రూ.1039 కోట్లు

పనులు ప్రారంభం: జనవరి, 2022

హైవే వాహనాలు ప్రారంభం: 2024, సెప్టెంబరు

టోల్‌ప్లాజాలు: 1 (పైనంపల్లి)

రైతులకు చెల్లించిన పరిహారం: రూ.253 కోట్లు

‘జిల్లాలో జాతీయ రహదారులు ఒక్కొక్కటిగా పూర్తవుతుండటం సంతోషాన్నిస్తోంది. ఖమ్మం రహదారులు అద్దాల్లా మెరవాలని ఆకాంక్షించా. అందుకనుగుణంగానే ప్రజల మద్దతుతో నిర్మాణం పూర్తిచేయించాం. రవాణా సౌకర్యం మెరుగుపడితేనే అభివృద్ధి సాధ్యం.’

- తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రి



పైనంపల్లిలోని టోల్‌ప్లాజా

‘ఇరు జిల్లాల ప్రభుత్వ పెద్దలు, రైతుల సహకారంతో నిర్మాణం దాదాపు పూర్తిచేశాం. మరో 3 కిమీ పరిధిలో కొంత పని మిగిలింది. వాహనాలను సోమవారం నుంచే హైవేపై అనుమతిస్తున్నాం. రహదారి పొడవునా ఇరువైపులా 7మీ వెడల్పుతో సర్వీసు రోడ్డు నిర్మించాం. పైనంపల్లి వద్ద టోల్‌ వసూలు ఏర్పాట్లు చేశాం. రుసుములను పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశాం. పూర్తయిన దూరానికే టోల్‌ వసూలు చేస్తాం.’

- వాణి, ఎన్‌హెచ్‌ఏఐ మేనేజర్

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా: జారే



చంద్రుగొండ కేజీబీవీలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చంద్రుగొండ, న్యూస్‌టుడే: అశ్వారావుపేట నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. చంద్రుగొండలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల తొలి ప్రాధాన్యం ఇస్తానన్నారు. చంద్రుగొండ కస్తూర్బా విద్యాలయంలోని రూ.47.50 లక్షలతో చేపట్టనున్న పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఆశ్రమ పాఠశాలలో మురుగు కాలువ పనులకు రూ.18 లక్షలు, పీహెచ్‌సీలో సీసీ రోడ్డుకు రూ. 10 లక్షలు, బీసీ బాలికల వసతి గృహ రహదారి నిర్మాణానికి రూ. 7లక్షలు, విద్యుత్తు ఉపకేంద్రం సీసీ రహదారికి రూ.7.50లక్షలు మంజూరైనట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలకు చెక్కులు అందజేశారు. అభివృద్ధి పనులపై గ్రామాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, ఎంఈవో సత్యనారాయణ, నాయకులు భోజ్యానాయక్, రమణ, ఏడుకొండలు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. దమ్మపేట గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో పాఠశాలల స్థాయి జోనల్ క్రీడలు మంగళవారం జరిగాయి. క్రీడల ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఐదు గ్రామ పంచాయతీలు తెలంగాణలో కలపాలి: మాజీ ఎంపీ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పట్ల సరైన విధానాలు అవలంబిచాలని మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. ఐద్వా శాఖ మహాసభలకు



నివాళి అర్పించి నినదిస్తున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు

హాజరైన ఆయన అమరవీరుల చిత్రపటాలకు మంగళవారం పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక విధానాలతో ప్రజల కనీస జీవన ప్రమాణాలు పడిపోతున్నాయన్నారు. విభజనతో ఏపీలో కలిసిన ఐదు గ్రామ పంచాయతీలను తక్షణమే తెలంగాణలో కలపాలన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. కుంజా మంగమ్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గడ్డం స్వామి, రామారావు, లీలావతి, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించండి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలు పరిష్కారించాలని అధ్యాపక బృందం భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావును కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు లాబ్, పరికరాలు, గ్రంథాలయ పుస్తకాలు ఇతర సమస్యలు ఉన్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడారని అధ్యాపక బృందం తెలిపింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: దమ్మపేట-పాల్వంచ ప్రధాన రహదారిపై జయలక్ష్మీ టాకీస్ సమీపంలో ఉన్న గుంత ప్రమాదకరంగా ఉంది. దీనివల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాల సమయంలో గుంతలో నీరు నిలిచి వాహనదారులకు గుంత అర్థంకావడం లేదు. వెంటనే గుంతను పూడ్చించాలి.
- వెంకటేశ్వరరావు, దమ్మపేట

సమాధానం: ర.భ. శాఖ అధికారులతో మాట్లాడి ప్రధాన రహదారిపై ఉన్న గుంతను వెంటనే పూడుస్తాం. వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- గుంటుపల్లి సురేశ్‌కుమార్, దమ్మపేట పంచాయతీ కార్యదర్శి**

– దమ్మపేట, న్యూస్‌టుడే

చెక్‌డ్యామ్‌లు శంకుస్థాపనలకే పరిమితమా..?

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

గిరిజన రైతుల బీడు భూములకు సాగునీటి వసతి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తూ నిర్మాణాలను చేపడుతోంది. గుత్తేదారుల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యం కారణంగా పనులు సకాలంలో ప్రారంభం కాకపోవడంతో అవి శంకుస్థాపనలకే పరిమితం అవుతున్నాయి. గుర్రాలబైలు, బొజ్జికుప్ప గిరిజన గ్రామాల్లో వాగుల ఆధారంగా ప్రభుత్వం చేపట్టిన చెక్‌డ్యామ్‌ల నిర్మాణం దుస్థితే ఇందుకు నిదర్శనం.



గుర్రాలబైలు వద్ద చెక్‌డ్యామ్ నిర్మాణ ప్రదేశం

ఆరు నెలలుగా..

గుర్రాలబైలు, బొజ్జికుప్ప గ్రామాల శివారులో రెండు చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు 2018 ఆగస్టులో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా సుమారు రూ.6.80 కోట్లు నిధులు మంజూరయ్యాయి. నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో వీటి నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఒక్కో చెక్‌డ్యామ్ పొడవు సుమారు 55 మీటర్లు, వెడల్పు 20 మీటర్లు, ఎత్తు సుమారు ఆరున్నర అడుగులు చొప్పున చేయాల్సి ఉంది. ఇవి పూర్తయితే దాదాపు 100 మంది రైతులకు చెందిన 200 ఎకరాల భూములకు సక్రమంగా సాగునీరు సరఫరా అవుతుంది. చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో వాగునీటిని సద్వినియోగం చేసుకోవచ్చని ఎదురుచూసిన రైతులకు చివరకు నిరాశ మిగులుతోంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ రేపోమాపో వస్తుందనగా.. ఈ ఏడాది మార్చి 16న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. అనంతరం పనులు ప్రారంభించాల్సిన గుత్తేదారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. నెలలు గడుస్తున్నా పనుల ఊసే దని గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం

చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం. ప్రస్తుతం పనులు చేయడానికి అనుకూల వాతావరణం లేకపోవడంతో మరో 10 నెలల్లోపు పూర్తిచేయాలని సమయం ఇచ్చాం. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతాం.
- రాజ్‌సుహాస్, నీటిపారుదలశాఖ ఏఈ

డీఎడ్ విద్యార్థుల ప్రవేశానికి మెరిట్ జాబితా విడుదల

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలోని గిరిజన డీఎడ్ కళాశాలలో డీఎడ్ పదో బ్యాచ్ విద్యార్థుల ప్రవేశానికి తయారు చేసిన మెరిట్ జాబితాను భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ మంగళవారం విడుదల చేశారు. మొత్తం 50 సీట్లకు గాను 48 సీట్లు మెరిట్‌లోను రెండు సీట్లు ప్రత్యేక కేటగిరీలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన కౌన్సిలింగ్ ఈ నెల 27న కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఐటీడీఏ డీడీ మణెమ్మ తెలిపారు. కౌన్సెలింగ్ హాజరయ్యే విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపల్ భవానీ పేర్కొన్నారు.

దమ్మపేటలో భారీ వర్షం

దమ్మపేట, న్యూస్‌టుడే: దమ్మపేట మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన వాన ఎడతెరిపిలేకుండా కురిసింది. దీంతో పట్వారిగూడెం, దమ్మపేట, మందలపల్లి, అల్లిపల్లి, జగ్గారం గ్రామాల్లో వరద నీరు రోడ్లపైకి చేరుకుంది. అల్లిపల్లిలో రెండు పడకగదుల ఇళ్లు నీటమునిగాయి. పట్వారిగూడెంలో పాల్వంచ-దమ్మపేట ప్రధాన రహదారి జలమయమైంది. పట్వారిగూడెంలో మురుగునీటి కాల్వలో పడి పాడిగేదె మృతిచెందింది.



అల్లిపల్లి రెండు పడక గదుల ఇళ్ల వద్ద వరద నీరు

జాతీయ స్ఫూర్తిని నింపేది సేవే: ఏడీ

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సేవా స్ఫూర్తి నింపడం అంటే జాతీయ భావాన్ని పెంపొందించడమేనని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్ అన్నారు. జాతీయ సేవా దినోత్సవం (ఎన్ఎస్ఎస్ డే) సందర్భంగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో మంగళవారం ప్రదర్శన, సాంస్కృతి కార్యక్రమాలు, ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. రాంప్రసాదు, రమేష్, గోపాలకృష్ణమూర్తి, మధుసూధన్‌రెడ్డి, రెడ్డిప్రియ పాల్గొన్నారు.

రేయి చంద్రుడు కాదు.. ఉదయ భానుడు..!



ఈ చిత్రం చూస్తే రాత్రి సమయంలో మబ్బుల చాటున ఉన్న చంద్రుడు అన్నట్లుంది కదూ.. కానీ ఈయన ఉదయ భానుడు.. అశ్వారావుపేటలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఆకాశంలో మబ్బులు వేయడంతో వాటి చాడున ఉన్న భగభగలాడే భానుడు రాత్రి సమయంలో చల్లని వెన్నెలనిచ్చే చంద్రుడిలా కనిపించాడు. ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. **– అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే**

ఇడ్లీలో బొగ్గు ముక్కలు..?



మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భ గని క్యాంటీన్‌లో ఓ ఇడ్లీలో బొగ్గు ముక్కలు మంగళవారం దర్శనమివ్వటంతో కార్మికులు విస్మయానికి గురయ్యారు. ఈ ఘటన తమ దృష్టికి రాలేదని మణుగూరు ఏరియా అధికార ప్రతినిధి రమేశ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. విచారణలో వాస్తవమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. **- మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే**

అత్యాచార ఘటనపై కేసు

కరకగూడెం, న్యూస్‌టుడే: వీరాపురం గ్రామానికి చెందిన బిజ్జా సాంబయ్య అనే వ్యక్తి ఓ మైనర్ బాలికను తన ఇంట్లోకి ఎత్తుకెళ్లి అత్యాచారం చేశాడని బాలిక తల్లి కరకగూడెం పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఏడూళ్లబయ్యారం ఇన్‌ఛార్జి ఎస్సై రాజ్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై..

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో ఇరు వర్గాల మధ్య జరిగిన భూ వివాదంలో జేష్ఠ సత్యనారాయణ చౌదరి ఒక వర్గానికి అనుకూలంగా మాట్లాడారు. దీనిని మనసులో పెట్టుకుని మరో వర్గానికి చెందిన పేరాయిగూడెం నివాసి గుర్రాల సాయి మంగళవారం కారులో ఇంటికి వెళ్తున్న సత్యనారాయణ చౌదరిని ఆపి దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడు. చంపుతానని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై యయతిరాజు తెలిపారు.

ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండలో మంగళవారం ప్రైవేటు ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. చంద్రుగొండలో మురుగు కాలువ పనులు సాగుతుండగా విద్యుత్తు తీగలు అడ్డువచ్చాయి. వాటిని తొలగించేందుకు వెంకటేశ్వర్లు సరఫరా నిలిపే ప్రయత్నం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతని చేతికి, పొట్టపై భాగంలో గాయాలవడంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించారు.

ఇసుక వాహనం పట్టివేత

బూర్గంపాడు, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సోంపల్లి కిన్నెరసాని వాగు నుంచి ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనాన్ని గుర్తించి పోలీస్ ఠాణాకు తరలించారు. బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

యువతి అదృశ్యం

చర్ల, న్యూస్‌టుడే: పాతచర్లకు చెందిన ఓ యువతి మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

తెగిపడిన విద్యుత్తు తీగ.. రెండు పశువులు మృత్యువాత

చర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మారుమూల పూసుగుప్ప-పాతపూసుగుప్ప మధ్య అరణ్యప్రాంత రహదారిలో మంగళవారం 11కేవీఏ ప్రధాన విద్యుత్తు తీగ ఒక్కసారిగా తెగి పడిపోయింది. ఆ సమయంలో అటుగా వెళుతున్న రెండు పశువులు ఆ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. ఆ పశువులను తోలుకెళ్తున్న గిరిజనుడు ఈ ప్రమాదాన్ని గుర్తించి కొద్ది దూరంలో ఆగడంతో తప్పించుకున్నాడు. అనంతరం పాతపూసుగుప్పకు చేరుకొని ప్రమాద సమాచారాన్ని గ్రామస్థులకు చెప్పడంతో విద్యుత్తు అధికారులకు తెలపడంతో సరఫరాను నిలిపివేశారు. తీగలు తెగిపడిన సమయంలో రహదారిపై పాదచారులు, వాహనదారులు లేకుండటంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ ఎన్నిక

దమ్మపేట, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని పట్వారిగూడెంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా ఛైర్మన్ పూల రవీందర్ మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కమిటీలను నియమిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ జేఏసీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొజ్జా రమేశ్, కోకన్వీనర్‌గా దాసరి రామారావు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు బడికల పుష్పలత, కల్పన, గౌతమ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అపరాల సాగుపై రైతులకు అవగాహన

చంద్రుగొండ, న్యూస్‌టుడే: అపరాల సాగుపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. చంద్రుగొండలోని రైతువేదికలో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు హాజరయ్యారు.

కొబ్బరి వృక్ష మిత్రులు నైపుణ్యాభివృద్ధి సాధించాలి

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: కొబ్బరి బోర్డు ద్వారా అందిస్తున్న పథకాలపై అవగాహన పెంచుకోవాలని, నైపుణ్యాభివృద్ధి సాధించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి కొబ్బరి వృక్ష మిత్రులకు సూచించారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం- కొబ్బరి బోర్డు సారథ్యంలో జరుగుతున్న మంగళవారం రెండోరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పారిశుద్ధ్య పనులు బాధ్యతాయుతంగా చేయాలి: డీపీవో

పినపాక, కరకగూడెం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య పనుల నిర్వహణను బాధ్యతాయుతంగా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అన్నారు. పినపాక, జానంపేట, భూపాలపట్నం, కరకగూడెం, సమత్ భట్టుపల్లి పంచాయతీల్లో మంగళవారం ఆయన పర్యటించారు. తడి పొడి చెత్త నిర్వహణ, సేంద్రీయ ఎరువు తయారీని పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఎకో బ్రిక్స్ తయారీ వేగవంతం చేయాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, ఇళ్ల స్థలాలు కేటాయించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి డిమాండు చేశారు. మంగళవారం ఎర్రగుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌టీయూ నూతన మండల కమిటీ అధ్యక్షుడిగా జీఏ జయకర్, ప్రధాన కార్యదర్శిగా డి.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సేవాలాల్ సేన సమావేశం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలో సేవాలాల్ సేన భద్రాచలం సమావేశం మంగళవారం నిర్వహించారు. మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా బోడ వీరేందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి బూక్యా రమేశ్ నాయక్, ఇతర సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

తెజస సభ్యత్వ నమోదు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలో హైడ్రాను అమలు చేయాలని తెజస రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు అన్నారు. తెజస నాయకులు తిప్పన సిద్దులు ఆధ్వర్యంలో స్థానికంగా మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో ప్రజలు మోసపోతున్నారన్నారని, భద్రాచలంలో హైడ్రాను అమలు చేయాలని కోరారు. ఐదు గ్రామ పంచాయతీలు కలిపితేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. భద్రాచలం నియోజకవర్గ కోఆర్డినేటర్లుగా ప్రదీప్‌కుమార్, రామారావులను నియమించినట్లు వెల్లడించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

అశ్వాపురం, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని చేయాలని మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ భాజపా కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి కోరారు. మొండికుంటలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

న్యాయం చేయాలని నిరాహార దీక్ష

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు పురపాలకంలోని మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ రూ.43 లక్షల నగదు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ పురపాలక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కుమారస్వామి మంగళవారం కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. విచారణ చేయాలని కోరారు. గతంలో తన ఉద్యోగం కోల్పోయేలా చేశాడని కుమారస్వామి తెలిపాడు.

మాజీ సర్పంచి మృతి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఆర్లగూడెం మాజీసర్పంచి కొర్సా రమేష్(45) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఆయన గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి రమేష్ అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, నాయకులు నివాళులర్పించారు.

చెట్టుపై నుంచి పడి గిరిజనుడికి తీవ్ర గాయాలు

చర్ల, న్యూస్‌టుడే: చర్ల మండలం చీమలపాడుకు చెందిన గిరిజనుడు మంగళవారం సాయంత్రం చింతచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఇతని పొట్టలోకి చింత మొద్దు గుచ్చుకోవడంతో పేగులు బయటకు వచ్చి తీవ్రంగా గాయపడ్డాడు. భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నల్లపు



పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్

చర్ల, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి జ్ఞాపికతో పాటు లడ్డూ ప్రసాదాన్ని ఆయనకు అందించారు. జిల్లా ఎస్టీసెల్ ఛైర్మన్ డాక్టర్ రవికుమార్, తిరుమల, బానోత్ వెంకటేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హోంమంత్రితో భేటీ



హోంమంత్రి అనితను సత్కరిస్తున్న వంశీకృష్ణ తదితరులు

బూర్గంపాడు, న్యూస్‌టుడే: ఏపీ హోంమంత్రి అనితను బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన తాళ్లూరి చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పాయకరావుపేటలోని ఆమె నివాసంలో మంగళవారం కలిసి శాలువాతో సత్కరించారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తూము రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఐటీడీఏ సాయం

భద్రాచలం, న్యూస్‌టుడే: దుమ్ముగూడెం మండలం మంగువాయిబాడువ గ్రామానికి చెందిన పోడియం సురేష్ అనే గిరిజన వ్యవసాయ కూలీకి ఐటీడీఏ పీఓ రాహుల్ మంగళవారం రూ.25 వేల చెక్కును అందించారు. సురేశ్ గృహం ఇటీవల విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న పీఓ స్పందించి ఐటీడీఏ గిరిజన రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందజేశారు. ఏస్వో ఉదయభాస్కర్‌రావు పాల్గొన్నారు.



రూ.25 వేల చెక్కు అందిస్తున్న పీఓ రాహుల్

దాతల సాయంతో బాలికకు కృత్రిమ కాలు ఏర్పాటు

ములకలపల్లి, న్యూస్‌టుడే: ములకలపల్లి మండలం గుండాలపాడుకు చెందిన కారం మానసకు మంగళవారం కృత్రిమ కాలును అమర్చారు. మానస ఇంటర్ చదువుతున్న సమయంలో కాలుకి ఇన్‌ఫెక్షన్ సోకడంతో శస్త్ర చికిత్స చేయించేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది ఎదురైంది. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు బాలికకు గత ఏడాది శస్త్రచికిత్స చేయించారు. అప్పట్లో కాలును తొలగించారు. బాలికకు నాణ్యమైన కృత్రిమ కాలు ఏర్పాటు చేయించేందుకు ములకలపల్లికి చెందిన ఖమ్మం రూరల్ ఎస్సై పుష్పాల రామారావు చొరవ తీసుకుని పినపాకకు చెందిన సామాజిక కార్యకర్త తోలెం శ్రీనివాస్, హైదరాబాద్‌లోని ఎవల్యూషన్ ప్రోస్తెటిక్ లింబ్స్ సంస్థ ప్రతినిధి నాగరాజుల సహకారంతో విజయవాడకు చెందిన శ్రీనివాస్ ఆర్థిక సాయంతో విదేశాల నుండి దిగుమతి చేసుకున్న కృతిమ కాలుని బాలికకు హైదరాబాద్‌లో మంగళవారం అమర్చారు.

పవర్ లిఫ్టర్ వంశీకి రూ.30 వేల చెక్కు బహుమతి



వంశీకి రూ.30 వేల చెక్కు అందజేసిన మంతెన వెంకటరామరాజు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: పవర్ లిఫ్టర్ క్రీడాకారుడు వంశీని అభినందించి హైదరాబాద్‌లో వసుధా ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు రూ.30 వేల చెక్కును మంగళవారం అందజేశారు. ఇటీవల యూరప్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వంశీ భారతదేశం తరపున పాల్గొని బంగారు పతకం సాధించిన సంగతి తెలిసిందే. అక్టోబరు 4నుంచి 13 వరకు సౌత్ ఆఫ్రికాలో జరగనున్న కామన్ వెల్త్ పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీలకు హాజరు కానున్నారు. వసుధా ఫౌండేషన్ ఛైర్మన్‌ను సంప్రదించగా వారు వంశీని ప్రోత్సహించేందుకు రూ.30 వేల చెక్కును అందించారు.

భద్రాచలం కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం కోర్టు ఆవరణలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛభారత్‌లో జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం స్థానిక సబ్ జైలును సందర్శించి అక్కడ ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య, సభ్యులు, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఈవోపై ఆర్జేడీ విచారణ

దమ్మపేట, న్యూస్‌టుడే: దమ్మపేట మాజీ ఎంఈవో వనమా వెంకటేశ్వరరావు హయాంలో జరిగిన అవినీతి ఆరోపణపై వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి మంగళవారం విచారణ నిర్వహించారు. వనమా వెంకటేశ్వరరావు ఎంఈవోగా పనిచేసిన సమయంలో ఆయనపై మధ్యాహ్న భోజన బిల్లులు, ఉపాధ్యాయులకు సంబంధించిన సెలవుదినాల జీతభత్యాల చెల్లింపుల్లో అవకతవకలు చేశారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వరరావు నుంచి ఆర్జేడీ వివరాలు సేకరించారు.

ఐక్య పోరాటాల ఫలితంగానే లాభాల వాటా చెల్లింపు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కార్మిక సంఘాల ఐక్య పోరాటాల ఫలితంగానే కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించిందని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మణుగూరులో మంగళవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్ని ఆందోళనలు చేసినా గత భారాస ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను గుర్తించి వారికీ లాభాల వాటా ఇవ్వడం అభినందనీయమన్నారు. నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సుధాకర్, సాంబశివరావు పాల్గొన్నారు.

తీవ్ర అన్యాయం చేశారు: తెబొగసం

మణుగూరు పట్టణం: సింగరేణి లాభాల్లో వాటా పంపిణీలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెబొగకాసం ఏరియా ఉపాధ్యక్షులు నాగెల్లి ఆరోపించారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రూ 4,701 కోట్ల లాభాలు వస్తే రూ.1,551 కోట్లు కార్మికులకు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.796 కోట్లు మాత్రమే కార్మికులకు చెల్లించటం సరికాదన్నారు. ఇజ్రాయిల్, పవన్‌కుమార్, నాగేశ్వరరావు, ముకేశ్, పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెబొగకాసం నాయకులు

గుంతల దారులు.. ప్రయాణికులకు ఇబ్బందులు

బూర్గంపాడు, న్యూస్‌టుడే



సారపాక నుంచి ఇరవెండి వెళ్లే రహదారి

అధ్వాన్న రహదారులతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గోదావరి వరదలతో పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బూర్గంపాడు మండలంలోని పలు రహదారులు పూర్తిగా ఛిద్రమయ్యాయి. ఈ మార్గాలు పెద్దపెద్ద గోతులతో నిండి ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ప్రధానంగా సారపాక నుంచి నాగినేనిప్రోలు రెడ్డిపాలెం మీదుగా బూర్గంపాడు వెళ్లే రహదారి పూర్తి గుంతలమయమైంది. భారీగా గుంతలు ఏర్పడడంతో ప్రయాణం నరకప్రాయంగా మారడంతోపాటు ప్రమాదాలకు నిలయంగా తయారైంది. గుంతలను గమనించిన ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సారపాక నుంచి బూర్గంపాడు మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఏపీలోని కుక్కునూరు మండల కేంద్రానికి సైతం ఇదే దారిలో వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. సరకు రవాణా వాహనాలు సైతం పెద్ద సంఖ్యలోనే ప్రయాణిస్తూ ఉంటాయి. రహదారి సరిగా లేకపోవడంతో స్థానికులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సారపాక నుంచి మోతె పట్టినగర్ మీదుగా ఇరవెండి వెళ్లే మార్గం కూడా గుంతలతో నిండి ఉంది. మొండికుంట మీదుగా అశ్వాపురం వెళ్లే దారి కావడంతో ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తూ ఉంటాయి. గుంతలమయంగా మారిన రహదారులకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈ హరిలాల్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రెండు రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అనుమతులు రాగానే మరమ్మతులు చేయిస్తామని వివరించారు.

మావోయిస్టు కీలక నేతల మృతదేహాల గుర్తింపు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు- మావోయిస్టు దళాల మధ్య సోమవారం జరిగిన ఎదురు కాల్పుల ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందిన సంగతి తెలిసిందే. మృతుల్లో మావోయిస్టు కీలక నేతలున్నారని నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్‌కుమార్ ఛత్తీస్‌గఢ్ మీడియాకు వెల్లడించారు. మృతుల్లో ఒకరు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అగ్రనాయకుడు రూపేష్(53) అని గుర్తించారు. అతను మహారాష్ట్ర రాష్ట్రంలోని గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టు ఉద్యమ కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు కంపెనీ నంబర్-10కు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నాడు. అతనిపై సుమారు రూ.25 లక్షలు రివార్డు ఉంది. మరో మావోయిస్టు మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాఘాట్ జిల్లాకు చెందిన డివిజనల్ కమిటీ సభ్యుడు జగదీష్‌గా(48)గా గుర్తించారు. అతనిపై సుమారు రూ.16 లక్షలు రివార్డు ఉంది. మృతి చెందిన మరో మహిళా మావోయిస్టు వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలం నుంచి ఒక ఏకే-47 రైఫిల్, 12 బోర్ గన్, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆర్.కొత్తగూడెం శివారులో కరపత్రాలు

చర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆర్.కొత్తగూడెం శివారులో మంగళవారం మావోయిస్టు కరపత్రాలు వెలిశాయి. మావోయిస్టు ఆవిర్భావ ఉత్సవాలను జయప్రదం చేయాలని కరపత్రాలల్లో పిలుపునిచ్చారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరిట ఈ కరపత్రాలు వెలిశాయి.

TG

కొత్తగూడెం
• కొత్తగూడెం • ఇల్లెందు

19 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

జూలూరుపాడు, న్యూస్‌టుడే: పాపకొల్లు పంచాయతీ భీమ్లాతండాలో మంగళవారం వేర్వేరు ఇళ్లలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. తండాకు చెందిన వాంక్‌డోత్ రఘు ఇంట్లో 5 క్వింటాళ్ల బియ్యం పౌరసరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ ఆర్.ఐ. వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిమ్మటూరి సత్యం ఇంట్లో నిల్వ ఉంచిన 14 క్వింటాళ్ల బియ్యాన్ని జూలూరుపాడు పోలీసులు పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని పాపకొల్లుకు చెందిన కొట్టె నరసింహారావు, వాంక్‌డోత్ వినోద్, జడలచింతకు చెందిన గరికె రామారావు అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తిరుపతిరావు తెలిపారు.

రేపు ఉద్యోగ మేళా

సుజాతనగర్, న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో 50 ఖాళీల ఉద్యోగాల భర్తీకి 26న ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ తెలిపారు. కనీసం పదో తరగతి చదివి, 18 నుంచి 45 ఏళ్ల వయసు వారు గురువారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.



లక్ష్మీదేవిపల్లి ఠాణాలో సీఐ, ఎస్సైతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

ఎస్పీ సందర్శన

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ రోహిత్‌రాజు మంగళవారం సందర్శించారు. వివిధ సమస్యలతో ఠాణాకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేకూరేలా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిధిలో నేరాలు జరగకుండా గస్తీ పెంచాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులతో మాట్లాడి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమణారెడ్డి పాల్గొన్నారు.

'శిరస్త్రాణంలేని ప్రయాణం నేరం'

టేకులపల్లి, న్యూస్‌టుడే: శిరస్త్రాణంలేని ప్రయాణం చట్టరీత్యా నేరమని టేకులపల్లి ఎస్సై పి.సురేశ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. శిరస్త్రాణం ఉంటే ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని సూచించారు.

దసరా పండుగ ముందస్తు చెల్లింపు

కొత్తగూడెం సింగరేణి: అక్టోబరులో దసరా పండుగను పురస్కరించుకొని సింగరేణిలో హిందూ ఉద్యోగులకు రూ.25వేలు ముందస్తు చెల్లింపును ఈ నెల వేతనాలతోపాటు ఇవ్వనున్నారు. మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

దాతల సహకారం.. విద్యార్థులకు పౌష్టికాహారం



కాకర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

ఈ చిత్రంలో మధ్యాహ్న భోజనం కోసం విద్యార్థులు బారులు తీరిన దృశ్యం చూశారా? కాకర్ల ఉన్నత పాఠశాలలో తిథి కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో విద్యార్థులకు రోజువారీ భోజనం బదులు భిన్నంగా పౌష్టికాహారం అందేలా మంగళవారం భోజనం వడ్డించారు. మధ్యాహ్న భోజనంలో సాధారణంగా ఏదో ఒక కూరతో సరిపెడుతుంటారు. కానీ నాలుగు రకాల కూరలు, పెరుగు, సాంబారు, చిప్స్‌తో భోజనం వడ్డిస్తే.. ఇంకేముంది ఆహా ఏమి రుచి.. తిందామా మైమరిచి అంటూ విద్యార్థులు ఇలా క్యూ కట్టారు. పాఠశాల ఉపాధ్యాయులే తమ విద్యార్థులకు భోజనం వడ్డించారు. నెలలో ఒకటి, రెండు సార్లు దాతల సహకారంతో పౌష్టికాహారం అందేలా చూడాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో ఇలా అందిస్తున్నారు.

– జూలూరుపాడు, న్యూస్‌టుడే

అప్పుడప్పుడు.. అక్కడక్కడ

● దోమల నియంత్రణలో కంటితుడుపు చర్యలు

కొత్తగూడెం పట్టణం, ఇల్లెందు గ్రామీణం, పాల్వంచ, న్యూస్‌టుడే

ఇటీవల కురిసిన వర్షాలు, వరదల ప్రభావంతో జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ పురపాలకాల పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ముసురు కారణంగా దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగింది. పురపాలకాల్లో అనారోగ్య వాతావరణంతో జ్వర బాధితుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. జిల్లా ఆసుపత్రిలో ప్రతి రోజూ సగటున 450 నుంచి 600 వరకు ఓపీ నమోదవుతోంది. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లోనూ నిత్యం 70 నుంచి 120 మంది చికిత్స చేయించుకుంటున్నారు. ఆ మేరకు ఖర్చు చేయడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఖర్చుల మోత..

ఫాగింగ్ పరికరంలో పెట్రోల్, కిరోసిన్ వినియోగం అనివార్యం. ఈ ఇంధనాల కొనుగోలుకు పురపాలక సాధారణ నిధుల నుంచి ప్రతి రోజు ఖర్చుల మోత మోగిస్తున్నారు. ఏడాది మొత్తంలో రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నట్టు రికార్డుల్లో బిల్లులున్నా ఆచరణలో అందుకు తగిన ప్రయోజనం ఒనగూరడం లేదు. సాయంత్రం కనీసం ఆరు వార్డుల చొప్పున ఫాగింగ్ చేయాల్సి ఉండగా కేవలం ప్రాబల్యం ఉన్న కౌన్సిలర్ల వార్డుల్లో, ఇతర ప్రాంతాల్లో మాత్రమే నామమాత్రంగా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి రోజు దీనికయ్యే వ్యయం సగటున రూ.2వేల వరకు చూపుతున్నా దోమల వ్యాప్తికి అడ్డుకట్ట పడటం లేదు.

	కొత్తగూడెం	పాల్వంచ	ఇల్లెందు
వార్డులు:	36	24	24
ఫాగింగ్ పరికరాలు	7.. అన్నీ పాతవే	5.. రెండు పాతవి, మూడు కొత్తవి..	6.. రెండు పని చేయడం లేదు.
పట్టణ విస్తీర్ణం: (చ.కి.మీ.)	16.05	20	10.05

ఎందుకిలా?

పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా పురపాలకంలో వీధులు శుభ్రం చేయటంతోపాటు దోమలమందు పిచికారీ, గంబూషియా చేపలను మురికి గుంతల్లో వదలడం, ప్రతీ రోజు సాయంత్రం సమయాల్లో వీధుల వెంట ఫాగింగ్ చేయాలి. దోమల నియంత్రణలో ప్రధానమైన ఫాగింగ్ మూడుచోట్లా నామమాత్రంగా సాగుతోంది. అప్పుడప్పుడు, కేవలం అక్కడక్కడ మాత్రమే చేస్తూ చేతులు దులుపుకొంటున్నారు. ఒక్కో ఫాగింగ్ పరికరాన్ని రూ.50వేలు వెచ్చించి కొనుగోలు చేసినా కార్యాలయాలకు పరిమితం చేస్తున్నారు. చాలమేర పాత పరికరాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. పాల్వంచ, ఇల్లెందు పురపాలకాల్లో రెండ్రెండు యంత్రాలు పని చేయటం లేదు.

వర్షాల నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నాం. దోమల మందు పిచికారీతో పాటు ఫాగింగ్ కొనసాగిస్తున్నాం. అన్ని వార్డుల్లో ఒక్కో దఫా పూర్తి చేశాం. సాధారణ నిధుల నుంచి కొంత మొత్తాన్ని కేటాయించి అవసరమైన ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నాం. నిరంతర ప్రక్రియగా ఫాగింగ్ చర్యలు చేపట్టాలని పారిశుద్ధ్య జవాన్లకు సూచిస్తున్నాం.

– శేషు, కొత్తగూడెం పురపాలక కమిషనర్



పాల్వంచ పుర వీధుల్లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

విద్యార్థుల ప్రతిభ

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచలోని నవభారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 17 నుంచి 19 వరకు నల్గొండ జిల్లాలో జరిగిన ఏకశిల అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ స్కూల్ సీబీఎస్ క్లస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 విభాగంలో షార్ట్‌పుట్‌లో దియా, అండర్-19 విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో జ్ఞానవి సత్తాచాటారన్నారు. వీరిని పాఠశాలలో మంగళవారం అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీదేవి, కోచ్ పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

'ఎన్‌సీసీ' వేడుకలు

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కొత్తగూడెం-పాల్వంచ జంట పట్టణాల్లో 'ఎన్‌సీసీ' వేడుకలను వివిధ విద్యాలయాల్లో మంగళవారం నిర్వహించారు. చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ అధికారి బండి వెంకటేశ్వర్లును ప్రిన్సిపల్ కత్తి రమేశ్, జిల్లా షీటీం ఎస్సై రమాదేవి, అధ్యాపకులు సత్కరించారు. పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ పసుపులేటి శంకర్ అధ్యక్షతన వేడుకలు జరిగాయి.

28న లోక్ అదాలత్

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సూచించారు. రాజీ పడదగిన కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు అవకాశముంటుందన్నారు.

జీసీసీ కేంద్రం సందర్శన

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: పాల్వంచ జీసీసీ కేంద్రాన్ని డీఎం దావిద్ మంగళవారం సందర్శించారు. గోదాములు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ముష్టిగింజలు, విప్పపువ్వు నిల్వ కేంద్రాలను సందర్శించి కాంటాలు వేశారు. మేనేజర్ లక్ష్మోజి తదితరులు ఉన్నారు.

28న 'ఎన్‌హెచ్ 930పీ' నిర్వాసితులతో సమావేశం

టేకులపల్లి, న్యూస్‌టుడే: బేతంపూడి, గొల్లపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో వ్యవసాయ భూమి, పక్కాఇళ్లు కోల్పోతున్న 'ఎన్‌హెచ్ 930పీ' నిర్వాసితులతో ఈ నెల 28న జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగభవాని తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించే సమావేశంలో పరిహారం ఖరారు చేస్తామన్నారు.

'సేవా దృక్పథం అలవర్చుకోవాలి'

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రధానచార్యులు వై.చిన్నప్పయ్య అన్నారు. ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. 'ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమన్వయకర్త కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సత్కారం



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ, న్యూస్‌టుడే: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పాల్వంచ కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. నాయకులు బరపటి వాసుదేవరావు, ముత్తయ్య, భాస్కర్‌రావు, వెంకన్న, వెంకటాచారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కొల్లు పద్మ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు కోనేరు చిన్ని, తూము చౌదరి ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో పురపాలక మాజీ వైస్ ఛైర్మన్ రావి రాంబాబు, మాజీ ఎంపీటీసీ భద్రమ్మ, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

'పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి'

టేకులపల్లి, న్యూస్‌టుడే: యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేశ్ సూచించారు. 'టుబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0'లో భాగంగా మంగళవారం సులానగర్ పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ కేఎం తార, సీహెచ్ఓ పార్వతి, హెచ్ఈఓ దేవా, పీహెచ్ఎన్ చంద్రకళ, హెచ్ఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

'కేయూ' క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పాల్వంచ, న్యూస్‌టుడే: కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 19 నుంచి 23వరకు నిర్వహించిన ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్ క్రీడాపోటీల్లో నెహ్రూనగర్ కాలనీలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ అనురాధ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను మంగళవారం అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు హర్షిత, శిరీష, సంధ్యారాణి, నందిని, శ్యామల, విద్యశ్రీ ఎంపికయ్యారన్నారు. వైస్ ప్రిన్సిపల్ సంగీత, వ్యాయామ ఉపాధ్యాయురాలు శ్వేత పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ అనురాధ

పిల్లల సహనానికి పరీక్ష..!



శిబిరంలో తమవంతు కోసం వేచిచూస్తున్న చిన్నారులు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: వినోబానగర్‌లో మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో గ్రామస్థులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పనిలో పనిగా స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సైతం శిబిరానికి రప్పించారు. ఒక వైపు వైద్యాధికారి వెంకటేశ్వర్లు వృద్ధులను పరీక్షిస్తుండగా, చిన్నారులు తమవంతు కోసం ఇలా వరసలో నిలబడి వేచిచూస్తున్నారు.

బోడులో ఆర్టీసీ డీఎం పర్యటన

టేకులపల్లి, న్యూస్‌టుడే: బోడు ఏజెన్సీ ప్రాంతానికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలన్న వినతుల నేపథ్యంలో కొత్తగూడెం ఆర్టీసీ డీఎం దేవేందర్‌గౌడ్ మంగళవారం బోడులో పర్యటించారు. బోడు నుంచి ఇల్లెందు మండలం రామకృష్ణాపురం వరకు, మరోవైపు టేకులపల్లి మండలం కొప్పురాయి వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని దేవేందర్‌గౌడ్ హామీ ఇచ్చారు. కంట్రోలర్ రామనర్సయ్య ఉన్నారు.

★ కొత్తగూడెం నుంచి బోడు మీదుగా గుండాల వరకు బస్సు సర్వీస్ ప్రారంభించాలని ఎన్డీ నాయకులు డి.ప్రసాద్, ఎట్టి నరసింహారావులు డీఎం దేవేందర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు.



స్థానికులతో సమావేశమైన కొత్తగూడెం డీఎం దేవేందర్‌గౌడ్

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. కొత్తగూడెంలోని కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పలువురు న్యాయవాదులతో కలిసి చెత్తను తొలగించారు. న్యాయమూర్తి బత్తుల రామారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లీనింగ్ డ్రైవ్: కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: 'స్వచ్ఛతాహీ సేవా'లో భాగంగా పురపాలకంలోని ప్రజా శౌచాలయాల్లో మంగళవారం క్లీనింగ్ డ్రైవ్ చేపట్టారు. శౌచాలయాలను శుభ్రం చేసి పారిశుద్ధ్య సిబ్బంది ముగ్గులు వేశారు. బహిరంగ మూత్ర, మల విసర్జన నిషేధానికి ప్రతీ ఒక్కరూ కట్టుబడి ఉండాలని కమిషనర్ శేషు సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్రాచారి, ఐటీసీ వావ్ ప్రోగ్రాం అధికారి రవి, జవాన్లు పాల్గొన్నారు.

రెండోరోజూ కొనసాగిన శిక్షణ: సుజాతనగర్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని జడ్పీ సీఈఓ చంద్రశేఖర్ అన్నారు. సుజాతనగర్ పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సుందరీకరణకు మొక్కలు పెంచుతున్న గృహ సముదాయాలను మంగళవారం పరిశీలించారు. పాత అంజనాపురం రైతువేదికలో గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణలో మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎన్.తిరుమలేశ్, డీఈ పద్మావతి, ఏఈ నీలోఫర్, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కొత్తగూడెం న్యాయవిభాగం: కోర్టు ఆవరణలో చెత్తను తొలగిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



తోగ్గూడెంలో మాట్లాడుతున్న డీపీఓ చంద్రమౌళి

స్వచ్ఛమైన నీరందించాలి: డీపీఓ

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని డీపీఓ చంద్రమౌళి అన్నారు. తోగ్గూడెం గ్రిడ్‌లో గ్రామ మంచినీటి సహాయకుల రెండోరోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. స్వచ్ఛమైన నీటితో అతిసారం, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులను నివారించవచ్చన్నారు. గ్రిడ్ ఈఈ నళిని, డీఈ సాయి, ఎంపీఓ నారాయణ, ఏఈ నీలావతి పాల్గొన్నారు.

నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: పాత పాల్వంచ మొర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టణ ఎస్సై మంగళవారం పట్టుకున్నారు. వీటిని ఠాణాకు తరలించారు.

30న 'చలో హైదరాబాద్'

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రెండు ఇఫ్టూల ఆధ్వర్యంలో ఈ నెల 30న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి తరలిరావాలని రాష్ట్ర నాయకులు ప్రసాద్ కోరారు. ఇఫ్టూ కార్యాలయంలో మంగళవారం సమావేశంలో మాట్లాడారు. నాయకులు కొక్కు సారంగపాణి, నరాటి వెంకటేశ్వర్లు, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

టేకులపల్లి, న్యూస్‌టుడే: యుక్త వయసు బాలికలు ఆరోగ్యంపై దృష్టి సారించి, పౌష్టికాహారం తీసుకోవాలని టేకులపల్లి సీడీపీఓ కేఎం.తార సూచించారు. పోషణ మహా కార్యక్రమంలో భాగంగా మంగళవారం సులానగర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు దేవదాసు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యుత్కేంద్రాన్ని టీఎస్ జెన్కో నిర్మించాలి

పాల్వంచ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రామగుండంలో నిర్మించబోతున్న 800 మెగావాట్ల విద్యుత్కేంద్రాన్ని టీఎస్ జెన్కో ఆధ్వర్యంలో చేపట్టాలని పాల్వంచ కేటీపీఎస్ ఇంజినీర్స్ డిమాండ్ చేశారు. కేటీపీఎస్ విద్యుత్కేంద్రం ఆవరణలో మంగళవారం నిరసన తెలిపారు. సింగరేణి సంస్థకు సంబంధం లేకుండా నిర్మాణం చేపట్టాలన్నారు. ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు మంగీలాల్, మధుబాబు, బ్రాహ్మాజీ, యాకూబ్, మహేశ్, శ్రావణ్‌బాబు, శ్రీకాంత్, రాజేశ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కేటీపీఎస్ ఇంజినీర్లు

'సంస్థ వాస్తవ లాభాలు పంచండి'

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: గత ఉత్పాదక సంవత్సరంలో వచ్చిన మొత్తం లాభాల్లో నుంచి వాటాను చెల్లించాలంటూ తెబొగకాసం మంగళవారం ఆందోళన నిర్వహించింది. సంఘం నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ లాభాల్లో వాటా విషయమై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు, యాజమాన్యం మభ్యపెడుతున్నారని ఆరోపించారు. కృష్ణ కాపు, తుమ్మా శ్రీనివాస్, రాసూరి శంకర్, విజయ్, వెంకటేశ్వర్లు, సూరజ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ వైఖరి సరికాదు'

టేకులపల్లి, న్యూస్‌టుడే: లాభాలను పక్కదారి పట్టిస్తున్న యాజమాన్యాన్ని ఏఐటీయూసీ సమర్థించటం సరికాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు అన్నారు. కేటీసీలో మంగళవారం పిట్ సమావేశానికి హాజరయ్యారు. 23-24లో నికర లాభం రూ.4701 కోట్లు కాగా లాభాలు తగ్గించి ప్రకటించారని ఆరోపించారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ, బ్రాంచి కార్యదర్శి అబ్బాస్ పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సింగరేణి జీఎం సాలెమ్‌రాజు అన్నారు. రుద్రంపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో మంగళవారం మాట్లాడారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, వ్యాయామ ఉపాధ్యాయురాలు కవిత, మున్సిపల్ ఛైర్పర్సన్ సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు నల్లబ్యాడ్జీలను పెడుతున్న తెబొగకాసం నాయకులు కృష్ణ, శంకర్



మాట్లాడుతున్న సింగరేణి జీఎం సాలెమ్‌రాజు

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

కొత్తగూడెం సింగరేణి: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ సమన్వయాధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రిన్సిపల్ చింతా శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో సోదర ద్వయం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

ఇల్లెందు పట్టణంలోని 24ఏరియాకు చెందిన వార్డు కౌన్సిలర్ కుమ్మరి రవీందర్, వనిత దంపతుల ఇద్దరు కుమారులూ ఫుట్‌బాల్ పోటీల్లో రాణిస్తున్నారు. ఇల్లెందులోని ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న భువన్, ఎనిమిదో తరగతి చదివే శ్రావణ్.. సెలవు రోజుల్లో స్థానిక సింగరేణి రన్ అండ్ గోల్స్ మైదానంలో ఆటలాడేవారు. అదే మైదానంలో ఏటా వేసవిలో ఫుట్‌బాల్ విభాగంలో ఇస్తున్న శిక్షణపై వీరి దృష్టి మళ్లింది. వీరి ఆసక్తిని గమనించిన ఇల్లెందు ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీను, కోచ్ కాకటి రాకేశ్ అన్నదమ్ములను తీర్చిదిద్దారు. సోదరులిద్దరూ అంచెలంచెలుగా ఎదుగుతున్నారు.

◆ జూన్, 2022లో కొత్తగూడెంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో, 2023 నవంబరులో తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గద్వాలలో నిర్వహించిన 67వ అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో భువన్, శ్రావణ్ రాణించారు.

◆ ఈ వేసవిలో ఖమ్మంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదర్శ స్పోర్ట్స్ ఫౌండేషన్ నిర్వహించిన పోటీల్లోనూ ప్రతిభ చూపారు.



శ్రావణ్



భువన్

జాతీయ స్థాయి క్రీడల్లో శ్రావణ్

ఈ ఏడాది సెప్టెంబరులో జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ బాలబాలికల జట్లకు రాష్ట్రం నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహించగా ఆ ఇద్దరూ భద్రాద్రి జిల్లావారే. అందులో ఒకరు శ్రావణ్. ఈ నెల 7నుంచి 15వరకు అసోంలోని జోర్హాట్‌లో జరిగిన పోటీల్లో శ్రావణ్ పాల్గొనగా భద్రాచలానికి చెందిన బాలిక ఎం.యషిత మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది.

◆ శ్రావణ్ ఈ నెల 7న లక్షదీప్ జట్టుతో, 11న అసోం, 13న మధ్యప్రదేశ్ జట్లతో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు.

సంస్థ అభివృద్ధికి పాటుపడాలి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగాల్లో చేరిన యువత నైపుణ్యాభివృద్ధి సాధించి సంస్థ అభివృద్ధికి పాటుబడాలని సింగరేణి జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఇల్లెందు ఏరియాలో మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుల వారసులకు కారుణ్య నియామక ఉత్తర్వులను మంగళవారం అందజేశారు. జీఎం మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలని, బాధ్యతగా పని చేస్తూ సంస్థ పురోగతికి తోడ్పాటు అందించాలన్నారు. ఎస్వోటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జి.మోహన్‌రావు, ఏరియా రక్షణాధికారి రామస్వామి పాల్గొన్నారు.

★ గనిలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాజెక్టు ఆఫీసర్ ఎ.కృష్ణమోహన్ అన్నారు. ఇల్లెందు ఏరియా జేకే ఉపరితల గని వద్ద ప్రమాదాల నివారణపై ప్రత్యేక భద్రత, లాభాలపై మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. మేనేజర్ పూర్ణచందర్, అధికారులు శివప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందిస్తున్న సింగరేణి జీఎం జాన్ ఆనంద్

భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: జేకే కాలనీకి చెందిన కొప్పుల రాజేశ్ కొన్నాళ్లుగా మద్యానికి బానిసై వేధింపులకు గురిచేస్తున్నాడని భార్య రాధ మంగళవారం ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ రవి విచారణ చేస్తున్నారు.